క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరుగు సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కార్వేటినగరం : మండల పరిధిలోని ఎగువ రాజులకండ్రిగ సమీపంలోని శ్రీకారేటి గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగువరాజుల కండ్రిగ గ్రామానికి చెందిన మహిళలు పొంగళ్లు పెట్టి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. అలాగే అమ్మవారి ఆలయ ఆవరణంలో అంబళ్ల వేడుకను చేపట్టారు. ఈ సందర్భంగా కారేటి గంగమ్మ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం : మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.సీవో.ఇన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక వేళ దరఖాస్తు చేసుకోలేని వారు సర్టిఫికెట్ నకలు కాపీలతో మే 24వ తేదీలోగా కళాశాల ప్రిన్సిపల్‌ను నేరుగా కలిసి దరఖాస్తులు అందించాలని కోరారు. ఇతర వివరాలకు 91770 35120 ను సంప్రదించాలని సూచించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం : ఐటీఐ ప్రవేశాల కోసం మొదటి దశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గణేష్ అన్నారు. మంగళవారం ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఈ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మే నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ మెరిట్ ర్యాంకు ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో చిత్తూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నందు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 91600 12999, 91609 60999 నంబర్లను సంప్రదించాలన్నారు.

చెత్త తొలగింపు



జేసీబీతో చెత్తను శుభ్రం చేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలోని పుళ్లూరు పంచాయతీలో చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నాయని, వీధి దీపాలు పని చేయడం లేదని గ్రామస్తులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే స్పందించిన స్థానిక సర్పంచ్ భవ్య, ఎంపీడీఓ మోహన్‌మురళి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా చెత్త, ముళ్ల పొదళ్లను తొలగించి శుభ్రం చేశారు. వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

అసలే బ్రహ్మోత్సవాలు.. ఆలయ అధికారులపై అనుమానాలు.. హుండీ లెక్కింపులో చేతివాటం అంటూ అధికార టీడీపీ నాయకుల ఆరోపణలు.. విచారణ చేపట్టిన దేవదాయశాఖ ఉన్నతాధికారులు.. నెల గడిచినా విచారణపై నిగ్గుతేలని నిజాలు.. ఏడాదిగా పాలక మండలి లేని నైరాశ్యం.. అంతలోనే శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం. శివయ్యా.. నీ సన్నిధిలో రాజకీయం చేస్తున్న వారిని మన్నించవయ్యా..

శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర ఆలయం, (ఇన్‌సెట్) విశేష అలంకరణలో పార్వతీ పరమేశ్వర్లు





శివయ్యా.. మన్నించవయ్యా!

- పాలకమండలి లేకనే బ్రహ్మోత్సవాలా?
- ఏడాదిగా కమిటీ నియమించని కూటమి ప్రభుత్వం
- నేటి నుంచి శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

పుత్తూరు: నాదబ్రహ్మ త్యాగరాజస్వామి తన గానామృతంతో విగతజీవికి జీవం పోసిన ఘన చరిత్ర కలిగిన పురాతన ఆలయమే పుత్తూరులోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయానికి క్రమం తప్పకుండా పాలకమండలిని ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాడి దాదాపు ఏడాది కావస్తున్నా నేటికీ సదాశివేశ్వరుడి ఆలయానికి పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు సైతం తమ నాయకుడి నిర్లక్ష్యం పట్ల తమ అసంతృప్తిని కక్కలేక, మింగలేక సతమతమైపోతున్నారు. ఇందుకు తగ్గట్టు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక తిరుమలతో సహా అన్ని ఆలయాలపై రకరకాల ఆరోపణలు నిత్యకృత్యం అయ్యాయి. అందులో భాగంగానే ఇటీవల నిర్వహించిన ఆలయ హుండీ లెక్కింపుల్లో పాల్గొన్న అధికారులే చేతివాటం ప్రదర్శించారని సాక్షాత్తు టీడీపీ నాయకులే ఆరోపించారు. దీనిపై విచారణకు గత నెల 24వ తేదీన పుత్తూరుకు వచ్చిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, హుండీ లెక్కింపుల్లో పాల్గొన్న వారితో పాటు ఆరోపణలు చేసిన వారినుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకొని వెళ్లారు. అయితే ఇది జరిగి నెల దాటినా ఇంత వరకు విచారణ విషయాలను బయట పెట్టకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో వార్షిక బ్రహ్మోత్సవాల సమయం ఆసన్నమైంది. 10 రోజుల పాటు వైభవంగా నిర్వహించాల్సిన బ్రహ్మోత్సవాలు ఏమేరకు సక్రమంగా నిర్వహిస్తారో అన్న అనుమానాలు ఇటు భక్తులు, అటు ఉభయదారుల్లోనూ నెలకొంది.

నేడు ధ్వజారోహణం

పుత్తూరు పట్టణంలో శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 7 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై పది రోజుల పాటు నిర్వహిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం స్వామి అమ్మవార్లు రోజుకో వాహనాన్ని అధిరోహించి పట్టణంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. మే1న చంద్రప్రభ వాహనం, 2న యాలి వాహనం, 3న హంస, 4న శేష, 5న నంది, 6న గజ, 7న రథోత్సవం, 8వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు అశ్వ వాహనం, 9న అధికార నంది వాహనంపై స్వామి అమ్మవార్లు ఊరేగుతారు. 10వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి కావలసిన పోషకాలను వాడాలని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

కార్వేటినగరం : సైబర్ నేరాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సీడీపీఓ పద్మసునంద పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వీవో లీడర్లకు కిశోర్ వికాసం ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, ఏపీఎం, పీహెచ్ఎన్, ఐడీఎస్ పర్యవేక్షకులు శామిని, ఇందిరా పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

శ్రీరంగరాజపురం : కిశోరి వికాసంపై మండల కార్యాలయంలో సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘం సభ్యులు, మహిళా పోలీసు, ఏఎస్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సమాఖ్య లీడర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మ సునంద మాట్లాడుతూ.. యుక్త వయస్సు గల బాల బాలికల్లో వచ్చే మార్పులు గమనిస్తూ.. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కౌమార దశలో బాల, బాలికలు చెడు మార్గంలో నడవకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ మురళి పాల్గొన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రి పరామర్శ



వేల్కూరు బాబురెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు : చిత్తూరు జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వేల్కూరు బాబురెడ్డిని మంగళవారం రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. కంటి శస్త్ర చికిత్స చేసుకొని వేల్కూరులోని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న బాబురెడ్డిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, స్టేట్ గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కిషోర్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్కూరు కుట్టి, వాసుదేవ రెడ్డి , మోహన్, రాజీవ్, నాని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ మునివేలు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి పరిష్కరించాలని చెప్పారు. శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో శ్మశానాలకు దారి సమస్యతో పాటు కబ్జాదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశానాల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్య ఉన్న గ్రామాల్లో సర్వే చేసి శ్మశాన స్థలాలను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి

నింద్ర: మండల కేంద్రంలో రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరారు. విద్యుత్ అంతరాయంతో సోమవారం రాత్రి పూర్తిగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం కోసం లైన్‌మన్, ఏఈ కూడా ఆ సమయంలో ఫోన్‌కు అందుబాటులో లేరు. తిరుపతి, పుత్తూరు పట్టణాలలో నివసిస్తుండడం వలన ప్రజల సమస్యలు వారికి తెలియజేయలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అందుబాటులో అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గణనాథుని సేవలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు



కాణిపాకం: శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాజపక్స మంగళవారం కాణిపాకం వర సిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. రాజపక్సకు ఆలయ ఏఈఓ రవీంద్ర స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వైభవంగా గంగజాతర



గ్రామ దేవతకు అంబలి పోసి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో బుధవారం వైభవంగా గంగజాతర నిర్వహించారు. ఉదయం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం మహిళలు ప్రతి ఇంటి నుంచి అంబలి తీసుకొచ్చి అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమం చేపట్టారు. గరిగెకు ప్రతి ఇంటి నుంచి మహిళలు పసుపు నీరు పోసి కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

బ్యానర్ల వివాదం

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీల్లో మహాభారత ఉత్సవాల భాగంగా బుధవారం టీడీపీ , వైఎస్సార్ సీపీ నాయకులు తమ పార్టీ నాయకులతో బ్యానర్లు కట్టారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వైఎస్సార్‌సీపీ బ్యానర్‌లను తొలగించాలని మండల స్థాయి అధికారులు నాయకులపై ఒత్తిడి చేశారు. ఇరుపార్టీ నేతల బ్యానర్లను తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో సాకులు చూపించి కేవలం వైఎస్సార్‌సీపీ బ్యానర్‌లనే అధికారులు తొలగించారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో కేవలం వైఎస్సార్‌సీపీ నేతల బ్యానర్‌లనే తొలగించడం సరికాదని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

రెండో రోజు నిరాహార దీక్షలు



పుత్తూరులో ఆర్టీసీ ఉద్యోగుల నిరాహార దీక్షలు

పుత్తూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు రెండో రోజు మంగళవారం నిరాహారదీక్షలు కొనసాగించారు. తిరుపతి అధ్యక్షుడు పెరుమాళ్, జోనల్ కమిటి సభ్యులు ఆర్ముగం లు నిరాహార దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 డిపోలలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఎంయూ చేస్తున్న ఈ పోరాటాన్ని దశల వారీగా ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు కల్పించాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, మహిళల సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు మనోహర్, శేఖర్, కుమార్, రమేష్‌బాబు, నాదముని, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా నిలుద్దాం



చంద్రశేఖర్ రెడ్డిని సత్కరిస్తున్న కుమారస్వామి

నగరి : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించేందుకు వారికి అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ నగరి నియోజకవర్గ ఉద్యోగ, పింఛనుదారుల విభాగం అధ్యక్షులు కుమారస్వామి, రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డిని కోరారు. తిరుపతికి మంగళవారం విచ్చేసిన చంద్రశేఖర్‌రెడ్డిని కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు వారికి అండగా నిలబడాలని కోరారు.

నగర వనం.. అసంపూర్ణం



జారుబండ వద్ద ప్రమాదకరంగా గలుగు ఇసుక

ఆహ్లాదకర వాతావరణంతో ప్రజలు సేద తీరడానికి, సెమీ పర్యాటక కేంద్రంగా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన కార్వేటినగరం వనం నేడు సౌకర్యాలు లేక వెలవెలబోతోంది. గత ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా.. ప్రస్తుత కూటమి పాలకులు మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. చేపట్టాల్సిన పనులు సైతం అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ నగరవనం పురోగతి గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పర్యాటక ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- మౌలిక వసతులు కరువు
- అసంపూర్తిగా పనులు
- నీరుగారుతున్న గత ప్రభుత్వ ఆశయం
- నగరవనం పురోగతిపై కూటమి పాలకుల శీతకన్ను

కార్వేటినగరం: గతంలో కార్వేటినగరం.. సంస్థానాధీశుల కాలం నాటి నుంచి పర్యాటక కేంద్రంగా విరాజిల్లింది. అయితే ఆహ్లాదకరమైన వాతావరణంలో వనం ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో కార్వేటినగర వనం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. అలాగే కేంద్రప్రభుత్వం నుంచి రూ.1.80 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో వనం అభివృద్ధి చేయాల్సి ఉండగా నేటి పాలకులు తూతూమంత్రంగా పనులు జరిపి మిన్నకుండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చేయాల్సినవి ఇవీ..

కార్వేటినగర వనంలో పర్యాటకులను ఆకట్టుకునేలా బోటుషికారు.. విశ్రాంతి భవనం, చిన్న పిల్లలు ఆడుకునేందుకు జారుడు బండ, ఉయ్యాల వంటివి పిల్లలను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేయాలి. అలాగే యువకులకు జిమ్, వాకర్స్‌కు వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అన్నీ అరకొరగా ఉండడంతో వనం బోసిపోతోంది.

పార్కింగ్ ఎక్కడ..!

నగరవనం వద్ద పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలి. కానీ నగరవనం వద్ద పార్కింగ్ చేయడానికి అనువైన స్థలాన్ని కేటాయించక లేదు. కేవలం పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. కనీసం ఆ ప్రాంతంలో స్థలాన్ని చదును చేయలేదు. దీంతో అక్కడ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.

ప్రమాదకరంగా ఫ్లోటింగ్ బ్రిడ్జి

సందర్శకులను ఆకట్టుకునే విధంగా కుప్పానిగుంటలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా ఉంది. ఈ బ్రిడ్జికి నిబంధనల ప్రకారం ఉండాల్సిన రోప్‌లు కూడా లేకపోవడంతో పర్యాటకులు అందులో దిగేందుకు భయపడుతున్నారు. బోటుకు మూడు రోప్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కటే ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎంతో దూరదృష్టితో గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్వేటి నగర వనంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.









కార్వేటినగరం- పుత్తూరు రహదారిలో నగరవనం, జిమ్ వద్ద అసంపూర్తిగా నింపిన గలుగ ఇసుక, పార్కింగ్ స్థలం అధ్వాన్నం, ప్రమాదకరంగా ఫ్లోటింగ్ బ్రిడ్జి